క్లుప్తంగా

రజినీకుమారికి సన్మానం



టీజీపీఎస్సీ సభ్యురాలు రజినీకుమారిని సన్మానిస్తున్న తిమ్మాపురం గ్రామస్తులు

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామస్తులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) సభ్యురాలు, తిమ్మాపురం వాసి పాల్వాయి రజినీకుమారిని ఆదివారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రజినీకుమారి మాట్లాడుతూ తన కుమారుడు, కుమార్తెల జ్ఞాపకార్థం రూ.5లక్షల వ్యయంతో గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రజినీకుమారికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, గ్రామస్తులు బొడ్డు వెంకటనర్సు, బొడ్డు సోమరాజు, చెరుకుపల్లి లక్ష్మణ్, బొడ్డు శ్రీను, జీడి శ్రీను, సీహెచ్.భిక్షం, బి.రమేష్, జె.సైదులు, జీడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం

కోదాడరూరల్ : పట్టణంలోని చిరు వ్యాపారులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.నయీం అన్నారు. ఆదివారం పట్టణంలోని మండపం ఏరియా డబ్బీకొట్ల దుకాణాదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరు వ్యాపారులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మండపం ఏరియాలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన వారిని అడ్డుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్.నయీం, గౌరవ సలహాదారుడిగా బొలిశెట్టి కృష్ణయ్య, అధ్యక్షుడిగా పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా భూసాని మల్లారెడ్డి, కోశాధికారిగా ఎండీ.మహ్మద్, ఉపాధ్యక్షుడిగా దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా వేణుగోపాలరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల కార్యదర్శి జీడి సుందర్ డిమాండ్ చేశారు. తిమ్మాపురంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతులకు పంట పెట్టుబడి సాయం అందలేదని తెలిపారు. అలాగే ఇతర పథకాలను హామీ ప్రకారం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బూర్గుల రాంబాబు, జీడి లక్ష్మణ్, నర్సయ్య పాల్గొన్నారు.

యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులుకు సన్మానం



సైదులును సన్మానిస్తున్న మిత్రులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై తొండ గ్రామానికి బదిలీ అయిన రామన్నగూడెం వాసి, యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులును ఆదివారం గ్రామంలో 1988–89 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. యోగా మాస్టర్‌గా సైదులుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు రావడం తమ బ్యాచ్ విద్యార్థులకు సంతోషకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు దాసరి సోమయ్య, ధర్మారపు వెంకటయ్య, ఏలె వెంకన్న, కేసారపు శ్రీనివాస్, దడిపల్లి వెంకట్, పెద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక కమిటీ ఎన్నిక

మోతె : మోతె మండల పరిధిలోని విభళాపురం గ్రామానికి చెందిన గంట నాగలక్ష్మి, కొత్తగూడెం గ్రామానికి చెందిన జ్యోతుల ప్రీతి తెలంగాణ కళావేదిక నియోజకవర్గ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ వారిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ ఆదివారం ప్రకటనలో తెలియజేశారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీపీ దంపతులకు సన్మానం

అర్వపల్లి : మాజీ ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ దంపతులను కుంచమర్తిలో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీ రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ దంపతులను సన్మానిస్తున్న ఉపేందర్

హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు

- మద్దిరాలలో అంధకారంగా జాతీయ రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మద్దిరాల : మండలంలో 365 జాతీయ రహదారి వెంబడి ఉన్న హైమాస్ట్ లైట్లు రెండేళ్లుగా వెలగడం లేదు. దీంతో హైవే మొత్తం అంధకారంగా మారుతోంది. సూర్యాపేట–వరంగల్, సూర్యాపేట–మహబూబాబాద్, సూర్యాపేట–నల్లగొండ ప్రజలు ఈ 365 జాతీయ రహదారి గుండా నిత్యం ప్రయాణిస్తుంటారు. అయితే గతంలో హైవేపై పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు, మద్దిరాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ఈ లైట్లను అమర్చారు. కానీ అవి వెలగకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయంలో లైట్లు వెలగకపోవడంతో జాతీయ రహదారిపై



మద్దిరాలలో జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు

ఆయా గ్రామాల్లో వాహనదారులు భయం, భయంగా ప్రయాణిస్తున్నారు. కొన్ని ప్రమాదకర ప్రాంతాల్లో సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే పలువురి వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా చోటుచేసుకున్నట్లు ప్రయాణికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జాతీయ రహదారి



మద్దిరాలలో జాతీయ రహదారిపై రాత్రివేళలో వెలగని హైమాస్ట్ లైట్లు

వెంబడి హైమాస్ట్ లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రెండేళ్లుగా వెలగడం లేదు



జాతీయ రహదారి వెంబడి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి రెండేళ్లు దాటింది. కానీ ఇంత వరకు వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. హైవేపై అంధకారం ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– చెవిటి మహేష్‌యాదవ్, గుమ్మడవెల్లి

ఇబ్బందులు పడుతున్నారు



మద్దిరాల, ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డులలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కానీ వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. వాహనదారులు రాత్రి వేళల్లో హైవేపై ఇబ్బందులు పడుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, హైమాస్ట్ లైట్లను అందుబాటులోకి తేవాలి.

– రాంపాక వెంకన్న, ఆటో డ్రైవర్

పక్కాగా పంటల సాగు లెక్క

- క్షేత్ర స్థాయిలో పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

ఆత్మకూర్(ఎస్) : వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల వారీగా రైతులు ఏయే పంటలు, ఎన్ని ఎకరాలలో సాగు చేస్తున్నారు, పంట సాగు చేస్తున్నారా.. లేదా తదితర వివరాలను ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తున్నారు. పంటల వారీగా వివరాలను సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం, దిగుబడులు పరిగణనలోకి తీసుకొని కొనుగోలు కేంద్రాలు, గిట్టుబాటు ధరలు, పంటలకు నష్టపరిహారం తదితర వాటిని ప్రభుత్వం నిర్ణయిస్తుందని అంటున్నారు.

నమోదు లేకుంటే ఇబ్బందులే...

వ్యవసాయ శాఖ చేపడుతున్న పంటల సర్వేలో రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోకుంటే పంట విక్రయాలకు, ఏదైనా ఉపద్రవం సంభవించినప్పుడు పరిహారం అందుకునేందుకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు. రైతులు తమకున్న భూమిలో సర్వే నంబర్ వారీగా విస్తీర్ణాన్ని, పంటల సాగును అధికారులకు తెలిపితే అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంటల వివరాలు, విత్తన రకాలు, నీటి వసతి, యంత్ర పరికరాలు, పశువుల వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ తరహా వివరాల సేకరణ రైతులకు మేలు చేస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



పంటల సాగు సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి (ఫైల్)

సాగు లెక్కతో రైతులకు మేలు



క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను లెక్కించడం ప్రారంభించాం. ఏఈఓలు గ్రామాల వారీగా పర్యటిస్తూ రైతుల సమక్షంలో వారు సాగు చేస్తున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణం తదితర విషయాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతులందరూ అధికారులకు సహకరించి సాగు చేసే పంటల వివరాలను పక్కాగా నమోదు చేయించుకోవాలి. వీటి ద్వారా ధాన్యం అమ్ముకునే సమయంలో, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన సమయంలో రైతులకు మేలు జరుగుతుంది.

– దంతాల దివ్య, మండల వ్యవసాయాధికారి

అడుగుకో గుంత.. వానొస్తే బురద



బురదమయంగా మారిన వెంపటి నుంచి తూర్పుగూడేనికి వెళ్లే రోడ్డు

తుంగతుర్తి : తూర్పుగూడెం నుంచి వెంపటి వెళ్లే రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగూడెం నుంచి వెంపటి, రామన్నగూడెం మీదుగా బండరామారం వరకు గత ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించింది. కానీ కాంట్రాక్టర్ ఆగమేఘాల మీద పనులను ప్రారంభించి తూతూ మంత్రంగా మట్టి పోసి వదిలేశాడు. బీటీ రోడ్డు పనులు చేపట్టక రెండేళ్లు గడుస్తోంది. వెంపటి నుంచి రామన్నగూడెం, తూర్పుగూడెం గ్రామాలకు నిత్యం అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ గుంతలమయంగా మారిన రోడ్డుతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ రోడ్డుపై దృష్టి సారించి పనులను త్వరగా పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి



తుంగతుర్తిలో సవార్‌లచ్చమ్మ పండుగకు హాజరై పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న సవార్‌లచ్చమ్మ, పెద్ద మైసమ్మ పండుగకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఐక్యంగా ఉంటూ గ్రామ దేవతల పండుగలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయానికి రూ.50,000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, బీఎస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తిరుమలగిరి : తిరుమలగిరికి చెందిన బేతు కొండయ్య ఇటీవల మరణించారు. దీంతో ఆదివారం మృతుడి కుటుంబాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. కొండయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమానికి మారు పేరు కాంగ్రెస్

నూతనకల్ : ప్రజా సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అని నూతనకల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. త్వరలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. గత 10 సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని అంధకారంలోకి నెట్టిన గాదరి కిషోర్ నేడు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, పన్నాల రమమల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, ఇరుగు మధు, మొగుళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



గౌస్‌తండా వద్ద బిక్కేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న కూలీలు



ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఆత్మకూర్(ఎస్) : మండల వ్యాప్తంగా గత కొంత కాలంగా ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని బిక్కేరు వాగు నుంచి రోజుకు ఒక్కో గ్రామంలో ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా ప్రభుత్వ శాఖలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి.

ఇసుక తరలింపుతో చెక్ డ్యాంలకు ప్రమాదం..

మండలంలో బిక్కేరు వాగు పరిధిలోని పాతర్లపహాడ్, ముక్కుడుదేవులపల్లి, గౌస్‌తండా, రామన్నగూడెం, ఏపూరు గ్రామాల నుంచి ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వం మండల పరిధిలోని బిక్కేరు వాగుపై ఏడు చోట్ల చెక్ డ్యాంలు నిర్మించింది. కాగా లక్షల రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాంల సమీపంలో ఇసుకను తీస్తుండడంతో చెక్ డ్యాంలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని కొందరు రైతులు వాపోతున్నారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, బోర్లు ఎండిపోతున్నాయని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు రైతులు అంటున్నారు.

అడ్డుకుంటే దాడులు

మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి ఇసుక తరలింపునకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొన్ని గ్రామాల్లో రైతులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే ఇసుక ట్రాక్టర్ల యజమానులు వారిపై దాడులకు సైతం దిగుతున్నారు. రాత్రి సమయంలోనే కాకుండా పొద్దస్తమానం ఇసుకను తరలిస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 35వేల విరాళం అందజేత

నడిగూడెం : మండలకేంద్రంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపడుతున్న కల్యాణ మండపం నిర్మాణానికి కోదాడకు చెందిన రఘు కృష్ణమూర్తి, రమాదేవి దంపతులు ఆదివారం రూ.35వేల విరాళం ప్రకటించారు. ఆ నగదును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, వందనపు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



భానుపురి : కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : మొక్క నాటుతున్న నాయకులు



తిరుమలగిరిలో జెండావిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తోందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముల్కలపెల్లి రవిమాదిగ, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, ఎర్ర వీరస్వామి, జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు, మారేపల్లి సావిత్ర, ప్రభాకర్, బోడ శ్రీరాములు, దాసరి వెంకన్న, ములుగురి రాజు, చింతా సతీష్, సాంబయ్య, వెంకటేష్, కృష్ణ, నవీన్, వెంకటాద్రి, చిన్న పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాడుదాం

ఆత్మకూర్(ఎస్) : గత 30ఏళ్లుగా అనేక సామాజిక, మానవతా ఉద్యమాలతో పీడిత ప్రజలను ఐక్యం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కే ఉందని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజన్న మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి క్రిష్ణమాదిగ, ములకలపల్లి రవి మాదిగ, తిప్పర్తి భిక్షం మాదిగ, తిప్పర్తి గంగరాజు మాదిగ, ములకలపల్లి కిరణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మిర్యాల చిన్ని మాదిగ తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజల కోసం పోరాడింది ఎమ్మార్పీఎస్సే

తిరుమలగిరి : సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేసిందని ఆ సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చల్లకుంట్ల సోమన్న, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరు శ్రీను, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంబాబు, గొల్ల, కురుమల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కరాజు తిరుపతి, వివిధ సంఘాల నాయకులు గాదరబోయిన లింగయ్య, జేరిపోతుల యాదగిరి, పత్తెపురం నాగార్జున, నలుగూరి రమేష్, దుస్సా రామ్మూర్తి, కందుకూరి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి మధు మాట్లాడారు. మాదిగ ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణమాదిగ నేతృత్వంలో గత 30 సంవత్సరాల క్రితం ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని అన్నారు. మంద కృష్ణమాదిగ నేతృత్వంలో మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఎన్నో ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి పరశురాములు, నకిరేకంటి రమేష్, వీరబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా స్నేహితులు



రామన్నగూడెంలో చెక్కు అందిస్తున్న స్నేహితులు

అర్వపల్లి : రామన్నగూడెం గ్రామానికి చెందిన గొడిశాల కిరణ్(39) సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇటీవల మృతి చెందారు. దీంతో తోటి మిత్రులైన అర్వపల్లిలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కిరణ్ కుటుంబీకులకు రూ.52వేల చెక్కును అందజేశారు. తమ బ్యాచ్ విద్యార్థులకు, చదువు చెప్పిన గురువులకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే ఆర్థికసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10 కుటుంబాలను తమ బ్యాచ్ ఆధ్వర్యంలో ఆదుకున్నట్లు ఆ బ్యాచ్ విద్యార్థులు పేర్కొన్నారు.

సామినేని వెంకటేశ్వరరావు మృతికి సంతాపం

కోదాడరూరల్ : మండల పరిధిలోని తమ్మర గ్రామ మాజీ సర్పంచ్, గ్రామ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు(84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వెంకటేశ్వరరావు గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. నివాళులర్పించిన వారిలో టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, కందుల కోటేశ్వర్‌రావు, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, రావెళ్ల సీతారామయ్య, డాక్టర్ సుబ్బారావు, పలువురు కౌన్సిలర్‌లు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఉద్యోగులు, నాయకులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

మోతె : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మండల కేంద్రంలో పంపిణీ చేశారు. హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన మొగిలిచర్ల నాగయ్యకు రూ.60వేలు, దండుగల భద్రమ్మకు రూ.20వేలు, కూడలి గ్రామానికి చెందిన ఉసిరికపల్లి ఉపేందర్‌కు రూ.10వేల చెక్కులను అందజేశారు.

రుణమాఫీ అమలు చేయాలి

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు పెద్దింటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, మున్నా అశోక్, బిక్కి రవి, పులుసు రాములు, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆదమరిచామా.. ఆపద పొంచినట్టే!



జాజిరెడ్డిగూడెంలో తుంగగూడెం వెళ్లే రోడ్డు వెంట ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో నిలిచిన నీరు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని తుంగగూడెం వెళ్లే రోడ్డు వెంట గ్రామ శివారులో దారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు పొలాల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుదాఘాతం ఏర్పడుతోంది. ఈ దారిలో వెళ్లే రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీరు నిల్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దండోరా రజతోత్సవాలకు తరలిన నాయకులు

మద్దిరాల : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన దండోరా రజతోత్సవాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిరాల మండల కేంద్రం నుంచి భారీగా తరలివెళ్లారు. తరలిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు నవిలా మల్సూర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్, రాష్ట్ర కార్యదర్శి దంతాళ వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాంపాక వెంకన్న, గంగాదరి రమణ, సుజాత, పలువురు నాయకులు ఉన్నారు.



మద్దిరాల నుంచి తరలివెళ్తున్న నాయకులు